అటవీ భూముల ఆక్రమణ

రామచంద్రాపురంలోని రూ.కోట్ల విలువైన అటవీ భూములపై ఓ టీడీపీ నేత కన్నేశారు. రాజకీయ అండతో ఆక్రమణకు దిగారు. నకిలీ పత్రాలు సృష్టించి స్వాధీనం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా తొలుత జేసీబీలతో భూమిని చదును చేసే పనులు చేపట్టారు. అక్కడి మట్టిని ఇష్టారాజ్యంగా మరో చోటుకు తరలించి డంప్ చేసుకుంటున్నారు. ఈ మేరకు తిరుపతిలో రియల్టర్లకు అమ్ముకుని సొమ్ము చేసుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ తతంగంపై సమాచారం అందినప్పటికీ అధికారులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

- గుట్టుగా గుట్టను చదును చేయిస్తున్న టీడీపీ నేత
- ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు
- కనీస మాత్రం స్పందించని అధికారులు


యంత్రంతో గుట్టను చదును చేస్తున్న దృశ్యం


అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

రామచంద్రాపురం : మండలంలోని అనుప్పల్లెలో సర్వే నంబరు 411 నుంచి 490 వరకు అటవీ భూములు ఉన్నాయి. అనుప్పల్లె–చవటగుంట రహదారికి సమీపంలో ఉండడంతో ఈ భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఓ మాజీ ప్రజాప్రతినిధి వీటిని కాజేసేందుకు యత్నిస్తున్నారని స్థానికులు వెల్లడిస్తున్నారు. గతంలోనూ ఆ మాజీ ప్రజాప్రతినిధి పలు కొండలు, గుట్టలను చదును చేసి, తప్పుడు పత్రాలతో స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో అటవీభూములను చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు. భారీ యంత్రాల సాయంతో సుమారు 10 ట్రాక్టర్ల ద్వారా ఇక్కడి గుట్టను తవ్వేసి మట్టిని తరలిస్తున్నారు. ముందుగా పథకం ప్రకారం గ్రావెల్‌ను డంప్ చేసి ఆపై తిరుపతి నగరంలోని ప్లాట్లు, లే అవుట్‌లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాల నిమిత్తం విక్రయిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అధికార పార్టీలోని ఓ ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఈ ఆక్రమణలు జరుగుతున్నాయని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. రూ.కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుట్టలు, అడవులను ఇలా చదును చేసి అక్రమించుకుంటే వన్యప్రాణులు గ్రామాలపై పడే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు.

తీరు మారని వైనం

గతంలో మండలంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్‌ను తరలించి, ఆపై నకిలీ పత్రాలతో భూములను కాజేయడంతో అప్పటి తహసీల్దార్ కీలకపాత్ర పోషించారు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఆక్రమణలకు తహసీల్దార్ సహకరించారని తేలడంతో సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయం తెలిసినప్పటికీ ప్రస్తుత రెవెన్యూ అధికారులు మాత్రం ఏమాత్రం జంకకుండా ఆక్రమణదారులకు సహకరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కబ్జాదారుల నుంచి ముడుపులు అందడంతోనే అధికారులు చూసీ చూడనట్టు ఉంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అటవీ భూములను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ


నాగయ్యతో మాట్లాడుతున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : స్విమ్స్ పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నేత నాగయ్యను పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. నాగయ్యకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. వైఎస్సార్‌సీపీ నేతలు పడమటి కుమార్, మాకం చంద్రయ్య పాల్గొన్నారు.

11న ఉరుసు


పాకాలలోని దర్గా

పాకాల : మండల కేంద్రంలోని దర్గా వద్ద 105వ హజరత్ షేక్ ఫరీద్ మస్తాన్ ఔలియా వారి ఉరుసు ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు మత పెద్దలు, దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఉరుసులో భాగంగా 10వ తేదీన రాత్రి 7 గంటలకు దర్గా నుంచి గంధం ఊరేగింపు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాత్రివేళల్లో కవ్వాలీ ఉంటుందని, 10, 11వ తేదీల్లో మధ్యాహ్నం దర్గా వద్ద అన్నదానం నిర్వహించనున్నట్లు వివరించారు.

వండర్ బుక్‌లో 'ఆర్కే అబాకస్'


అవార్డును అందుకుంటున్న ఆర్కే సంస్థ ప్రతినిధులు

తిరుపతి సిటీ: లండన్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు రాపిడ్ అబాకస్–వేదిక్ మ్యాథమెటిక్స్‌పై నిర్వహించిన మౌఖిక పరీక్షకు ఆర్‌కే అబాకస్ విద్యార్థులు 250మంది హాజరై అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని సంస్థ చైర్మన్ రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దీంతో వండర్ బుక్ ఆఫ్ రికార్డులో ఆర్కే సంస్థ చేరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, అపుస్మా రాయలసీమ జోనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి, ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.హరికృష్ణ, లండన్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు నరేంద్రగౌడ్, అరుణ్, రవి కుమార్, ఆర్కే అబాకస్ సంస్థ డైరెక్టర్ విమల, ఐఐటీ ప్రొఫెసర్ రామకృష్ణ పాల్గొన్నారు.

సీఏ ఫలితాల్లో 'ఎమరాల్డ్స్' జయకేతనం


బి.లిఖిత్


పి.హర్షిత్

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఏ ఇంటర్, ఫౌండేషన్ ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు విద్యాసంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ సీఏ ఇంటర్ ఫలితాల్లో బి.లిఖిత్ 409మార్కులు, ఎం.రాధిక 340మార్కులు సాధించారని, ఈ పరీక్షకు హాజరైన తమ విద్యార్థుల్లో 52.77శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. అలాగే సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో పి.హర్షిత్ 301మార్కులు, ఎం.బాలాజీ 290, బి.నిరంజన్ 289మార్కులు సాధించారని, ఈ పరీక్షకు హాజరైన తమ విద్యార్థుల్లో 47.37శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సమష్టి కృషి


డీపీటీఓ జగదీష్‌ను సత్కరిస్తున్న నేతలు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని డీపీటీఓ జగదీష్ పిలుపునిచ్చారు. సోమవారం నూతనంగా కార్యాలయానికి విచ్చేసిన డీపీటీఓ జగదీష్‌ను ఆర్టీసీ వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, ముఖ్య ఉపాధ్యక్షులు లతారెడ్డి నేతృత్వంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డీపీటీఓ మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. అసోసియేషన్ నేతలు జీవీ ముని, అల్లయ్య, రాంబాబు, నరసింహులు, ప్రకాష్ పాల్గొన్నారు.

తాళ్లపాక అభివృద్ధికి వినతి

తిరుపతి అన్నమయ్యసర్కిల్: అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ టీటీడీ పాలక మండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి కోరారు. సోమవారం ఈ మేరకు టీటీడీ పరిపాలన భవనంలో ఈఓ శ్యామలరావుకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ తాళ్లపాక ముఖద్వారం నుంచి రోడ్డును వెడల్పు చేసి కవుల విగ్రహాలను ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. తాళ్లపాక చెరువులో అన్నమయ్య పద కవితలు రాస్తున్నట్లుగా విగ్రహం ప్రతిష్ఠించాలని సూచించారు. అలాగే వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని కోరారు. ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుంటామని టీటీడీ ఈఓ హామీ ఇచ్చారు.

వంచనకు కేరాఫ్ చంద్రబాబు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అభినయ్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : ఎన్నికల సమయంలో ఓట్ల కోసం నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, ఒక్క హామీని కూడా అమలు చేయకుండా వంచనకు కేరాఫ్‌గా మారారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో నగరంలోని దక్షిణ విభాగానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరించారు. అందులోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకోవాలని శ్రేణులకు సూచించారు. అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికి మూడుసార్లు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేర్చిన పాపానపోలేదన్నారు. అయినా ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చంద్రబాబు చెప్పే అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేసి మళ్లీ మోసపోతున్నారని తెలిపారు. ఎన్నికలప్పుడు చంద్రబాబు చెప్పే మాయమాటలు అలా ఉంటాయని, అధికారంలోకి వచ్చాకే ఆయన నిజస్వరూపం బయటపడుతుందని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన వందల హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. అయినవాళ్లనే మోసగించే చంద్రబాబుకు ప్రజలను వంచించడం పెద్దలెక్కేమీకాదని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి పేదవాడి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించిన దేవుడు జగనన్న అని కొనియాడారు. జగనన్న సంక్షేమ పాలనను కాదని కూటమికి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను చంద్రబాబు దగా చేశారని మండిపడ్డారు. ఆయన మోసాలను ఎండగట్టి ఇచ్చి హామీలను గుర్తు చేసేందుకే చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, శాలిని, నాయకులు శేఖర్ రెడ్డి, మహీధర్‌రెడ్డి, పడమటి కుమార్, నల్లాని బాబు, చంద్రయ్య, రాపూరి ప్రసాద్, అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని సోమవారం చైతన్యభారతి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథులుగా వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ హాజరై మాట్లాడారు. బ్రిటిష్ వారికి సింహస్వప్నంగా నిలిచిన పోరాట యోధుడు అల్లూరి అని కొనియాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సురేంద్రనాథ్ మాట్లాడుతూ మన్యం ప్రజల కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన గొప్ప దేశభక్తుడు అల్లూరి అని తెలిపారు. మణికంఠ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె.జనార్దన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వసుధ, ఏహెచ్ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

ఆగస్టు 7న ఓబీసీ మహాసభ


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

తిరుపతి కల్చరల్ : బీసీ డిమాండ్ల సాధనే లక్ష్యంగా గోవాలో ఆగస్టు 7వ తేదీన జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఏపీ అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. సోమవారం పద్మావతి విశ్రాంతి భవన్‌లో వారు మాట్లాడారు. గోవాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో చేపట్టే మహాసభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీతోపాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, 29 రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఈనెల 21న ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలలో బీసీ బిల్లుపై చర్చించి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రం జనగణతో పాటు కులగణన చేయడానికి ముందుకు రావడం స్వాగతిస్తున్నామని తెలిపారు. కులగణన ఆధారంగా జనాభా ప్రాతికపదికన బీసీ రిజర్వేషన్లను పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే కల్పించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతికుమారట్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా బీసీలందరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ పాల్గొన్నారు.

'శ్రీరామ'లో ఈఎన్‌హెచ్ ప్రతినిధులు


ప్రతినిధులను సత్కరిస్తున్న కళాశాల చైర్మన్

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజీని హైద్రాబాద్‌కు చెందిన ఈఎన్‌హెచ్ ఎమ్ఎన్‌సీ కంపెనీ ప్రతినిధులు రామసుబ్రమణ్య, ప్రేమలత సోమవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కళాశాలలో తమ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగాలను పెద్ద సంఖ్యలో కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం వారిని కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్ రెడ్డి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ జయచంద్ర, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు

నేడు వైఎస్సార్ జయంతి


సూచనలిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ప్రతి పంచాయతీలో ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తుమ్మలగుంటలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. అన్నిచోట్లా వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు. మండలాల వారీగా జయంతి ఏర్పాట్లను సమీక్షించారు.

తిరుపతి మంగళం : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9గంటలకు తుడా సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. పేదోళ్ల గుండె చప్పుడు వైఎస్సార్‌ను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించాలని పిలుపునిచ్చారు.

చంద్రగిరి నియోజకవర్గంలో..

తిరుపతి రూరల్ : వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం చంద్రగిరి నియోజకవర్గంలో భారీగా నిర్వహించనున్నారు. ఉదయం 7.30 గంటలకు తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకంలో వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేపట్టనున్నారు. అల్పాహారం వితరణ చేయనున్నారు. 9 గంటలకు చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద కేక్ కట్ చేసి, అల్పాహారం పంపిణీ చేపట్టనున్నారు. 9.15 గంటలకు ఎర్రావారిపాళెం మండలం నెరబైలు పంచాయతీలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నారు. 9.30 గంటలకు రామచంద్రాపురం మండలం నెన్నూరులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించనున్నారు. 10 గంటలకు పాకాల ఆర్టీసీ బస్టాండు వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేయనున్నారు. 10 గంటలకు చిన్నగొట్టిగల్లులో కేక్ కట్ చేయనున్నారు.11 గంటలకు లింగేశ్వరనగర్‌లో పేదలకు అన్నదానం, మధ్యాహ్నం 12 గంటలకు టీటీఆర్ కాలనీలో అన్నదానం చేపట్టనున్నారు.

ఎన్‌ఎల్‌యూ అడ్మిషన్లలో 'కౌటిల్య' సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీధర్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లోని కౌటిల్య విద్యాసంస్థ విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన నేషనల్ లా యూనివర్సిటీ (ఎన్‌ఎల్‌యూ)ల్లో సీట్లు సాధించినట్లు సంస్థ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎ.మాధుర్య ప్రియదర్శిని, ఎ.అజయ్‌కుమార్, తలిగట్లు సుభాష్ విశాఖపట్నంలోని దామోదర్ సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో, పి.రిషి ఈశ్వర్ ప్రసాద్ బెంగుళూరులోని రామయ్య లా కళాశాలలో ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ న్యాయ శాస్త్ర డిగ్రీ అడ్మిషన్ సాధించినట్లు వివరించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. క్లాట్ పోటీ పరీక్షకు సంబంధించి ఉచిత గైడెన్స్‌కు 96981 23456నంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

నృత్యంలో వరల్డ్ రికార్డు


విద్యార్థినులతో అధ్యాపకులు

తిరుపతి కల్చరల్: తమిళనాడు సేలంలోని కైలాస మానస సరోవరం స్కూల్ గ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనలో తిరుపతికి చెందిన శ్రీకల్యాణి నాట్య కళాక్షేత్రం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. నటరాజస్వామి ఆకారంలో 27 నిమిషాల 32 సెకండ్లపాటు సింహాల లేక్షణ సాయి, కందుల హావిష, బి.ప్రశ్విత‌శ్రీ, సి.కేతన భరత నాట్య ప్రదర్శన చేపట్టారు. రికార్డు సాధించిన చిన్నారులను కళాక్షేత్రం అధ్యాపకులు కె.కీర్తి అభినందించారు.

ఫీ'జులుం'పై చర్యలకు డిమాండ్


వీసీకి వినతిపత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : విద్యార్థులను అనధికార ఫీజుల పేరుతో వేధిస్తున్న ఎస్వీయూ పరిధిలోని లా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు వీసీ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో పలు లా కాలేజీలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడం దారుణమన్నారు. ఎటువంటి రశీదులు సైతం ఇవ్వకుండా నిలువు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి లా కాలేజీలపై పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమంగా వసూలు చేసిన ఫీజును విద్యార్థులకు తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. నేతలు ప్రేమ్‌కుమార్, అమృత తేజ్, సురేష్, యుగంధర్, మునస్వామి, బాలాజీ, మహేష్, లిఖిత్, పవన్ విజయ్, సునీల్, బోస్, ప్రణదీప్, వరుణ్ పాల్గొన్నారు

నోటీస్ బోర్డు

- తుమ్మలగుంటలోని కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్‌లో ఉదయం 8.30 నుంచి అంధుల రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్.
- వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు తుడా సర్కిల్‌లోని వైఎస్ విగ్రహానికి నివాళి.
- పద్మావతిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు చంద్రబాబు మోసాల మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరణ.
- శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు గ్రంథి సమర్పణ, సాయంత్రం యాగశాల పూజలు, హోమం.
- శ్రీగోవిందరాజస్వామి జ్యేష్టాభిషేకంలో భాగంగా ఉదయం 10 గంటలకు కవచ ప్రతిష్ట, అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం కవచ సమర్పణ, అనంతరం తిరుచ్చిపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు.

'గ్రీవెన్స్'కు 35 వినతులు

తిరుపతి తుడా : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 35 వినతులు వచ్చినట్లు అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. ఫోన్ ద్వారా 11 మంది తమ సమస్యలు తెలుపగా, 24 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించినట్లు వెల్లడించారు. . ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యామ్‌సుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ పాల్గొన్నారు

'పామాయిల్'తో అధిక ఆదాయం

రామచంద్రాపురం: పామాయిల్ సాగుతో తక్కువ ఖర్చుతోనే అధిక దిగుబడి సాధించవచ్చని 3ఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ ఉమ్మడి చిత్తూరు జిల్లా జోనల్ మేనేజర్ వెంకట మురళి తెలిపారు. సోమవారం ఆయన రావిళ్లవారిపల్లెకు చెందిన రైతు చిట్టిబాబు పొలంలోని పామాయిల్ తోటను పరిశీలించారు. వెంకటమురళి మాట్లాడుతూ సంప్రదాయ పంటలకంటే ప్రయోజనాలు ఎక్కువగా ఉండే పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలన్నారు.దీనికి ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు కంపెనీలు సాంకేతిక సహాయం అందిస్తున్నాయని వెల్లడించారు.

వైభవంగా జ్యేష్టాభిషేకం


తిరుచ్చిపై ఊరేగుతున్న దేవదేవేరులు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో జ్యేష్టాభిషేకం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రెండవ రోజైన సోమవారం స్వామివారికి కవచ ప్రతిష్టను వైభవంగా చేపట్టారు. శతకలశ స్నపనం, మహాశాంతి హోమం జరిపించారు. ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సమర్పణ నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో కలిసి శ్రీవారు తిరుచ్చిపై కొలువుదీరి ఊరేగారు.

వేడుకగా పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు సోమవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పంచమూర్తుల ఉత్సవర్లకు అర్చకులు స్నపన తిరుమంజనం, అలంకారం నిర్వహించారు.